

అట్టహాసంగా రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 ప్రారంభం

- మంత్రులతో కలిసి హాజరైన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి
- సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో కలిసి స్టాళ్ల పరిశీలన



మంత్రులతో కలిసి సమ్మిట్‌కు హాజరైన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. మంత్రులతో కలిసి సమ్మిట్‌కు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి హాజరయ్యారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2025లో స్టాళ్లను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులతో కలిసి పరిశీలించారు. 2047 నాటికి తెలంగాణను ట్రిపుల్ మిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ సమ్మిట్ కొనసాగింది. ఈ కార్యక్రమాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రారంభోత్సవం చేశారు. దేశ, విదేశాల్లో పేరు పొందిన కంపెనీల ప్రతినిధులు ఈ సమ్మిట్‌కు హాజరయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, లక్ష్మణ్, దామోదర్ రాజనర్సింహా, జూపల్లి, తుమ్మల, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలలు కల్లలు

- సర్పంచ్ పోటీ నుంచి చీటి రూపంలో తప్పిన అవకాశం!
- గుండెనొప్పితో ఆసుపత్రి పాలైన నాయకుడు




దుబ్బాక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : 20 ఏళ్లుగా కన్న కలలను 'ఆ చీటి'.. కల్లలుగా మార్చింది. సర్పంచ్‌గా పోటీచేసేందుకు రాక రాక వచ్చిన అవకాశం, లాటరీ డ్రా (చీటీ) ద్వారా పేర్లను ప్రకటించాలన్న అధికార పార్టీ నిర్ణయంతో చేజారింది. తాను బరిలో దిగాలనే ఆశలు గల్లంతవడంతో ఆ నాయకుడు గుండెనొప్పితో ఆసుపత్రిపాలవాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగానే ఉన్న ఆ నాయకుడిది దుబ్బాక మండలం రామక్కపేట గ్రామం.

ఆ గ్రామానికి చెందిన సదరు నాయకుడు విప్లవ పార్టీలో సేవలందించి, గ్రామసేవకు పలు కార్యక్రమాలను చేపడుతూ వచ్చారు. ఒకమారు మహిళా రిజర్వేషన్, మరోమారు ఎస్సీ రిజర్వేషన్.. ఇలా అవకాశం కలిసి రాలేదు. ప్రస్తుతం బీసీ జనరల్ రిజర్వేషన్ రావడంతో ఆ సీనియర్ నాయకుడికి ఈ సారి అవకాశం వచ్చింది. అధికార పార్టీలో ఉన్న ఆ నాయకుడితో పాటు మరొకరు ఈ స్థానాన్ని ఆశించారు. దీంతో ఇద్దరినీ పిలిచి, ఆ పార్టీ నాయకులు సముదాయించే ప్రయత్నం చేశారు. కానీ, వీరి మధ్య సయోధ్య కుదరకపోవడంతో చివరికి లాటరీ డ్రా (చీటి) వేయడానికి సిద్ధమయ్యారు. తననే అదృష్టం వరిస్తుందని సదరు నాయకుడు పూర్తి నమ్మకం పెట్టుకున్నాడు. మొదట ప్రత్యర్థి మాత్రం ససేమిరా అన్నప్పటికీ, ఇద్దరినీ నాయకులు ఒప్పించారు. కానీ ఆశలను చీటీ తారుమారు చేసింది. ఎదుటి వ్యక్తి పేరు డ్రాలో రావడంతో సదరు నాయకుడు ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. మాటమీద నిలబడే మనస్తత్వం కలిగిన వ్యక్తి కావడంతో, ఒప్పందానికి తలొగ్గక తప్పలేదు. తన దురదృష్టానికి కలత చెందిన ఆయన, తాను నామినేషన్‌ను ఉపసంహరించుకున్న రోజే గుండెనొప్పితో అస్వస్థతకు గురయ్యాడు. తలకిందులుగా చేసిన ఈ చీటి వ్యవహారం దుబ్బాక మండలంలో హాట్‌టాపిక్‌గా మారింది.

కోడ్ ఉల్లంఘించిన అభ్యర్థులపై
కేసు నమోదు

- మద్యం, డబ్బు పంపిణీ చేసినందుకు చర్యలు


సిద్దిపేట అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినందుకు గాను సిద్దిపేట అర్బన్ మండలంలోని ఎన్సాన్‌పల్లి, మిట్టపల్లి గ్రామాలకు చెందిన సర్పంచ్ అభ్యర్థులపై కేసులు నమోదు అయినట్లు త్రీటౌన్ సీఐ విద్యాసాగర్ సోమవారం తెలిపారు. ఎన్సాన్‌పల్లిలో సర్పంచ్ అభ్యర్థి అయిన నాగుల స్రవంతి ఎన్సాన్‌పల్లి పెద్దమ్మ గుడి వద్ద ఒకే కులానికి చెందిన 44 మందికి మద్యం పంపిణీ చేస్తున్నారని సమాచారం మేరకు సిద్దిపేట అర్బన్ మండల ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జి వంశీకృష్ణతో కలిసి పెద్దమ్మ గుడి వద్దకు వెళ్లి మద్యం పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉంచిన 68 రాయల్ స్టాగ్ క్వార్టర్ బాటిళ్లను, 39 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నాగుల స్రవంతితో పాటు 44 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇక మిట్టపల్లి గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి చింతల కుమార్ తన ఇంట్లో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తున్నారని సమాచారం మేరకు స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఆర్.ఎస్.ఐ సురేష్ తన సిబ్బందితో వెళ్లగా పోలీసు వారు వస్తున్నది గమనించి డబ్బులు గోడ అవతల పడేశారు. దీంతో రూ.25వేలు స్వాధీనం చేసుకున్నారు. చింతల కుమార్, అతనితో పాటు ఉన్న చింతల రాజుపై ఎన్నికల నియమావళి ఉల్లంఘన కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రారండోయ్..!

తొలివిడత పంచాయతీ పోరు తుది అంకానికి చేరుకున్నది. ఈనెల 11న పోలింగ్ నిర్వహించనుండగా నేటి సాయంత్రంతో ప్రచారం తెర పడనున్నది. ఇప్పటికే గ్రామాల్లో ఒక్కో ఇంటినీ, ప్రతీ ఓటరును నాలుగైదు సార్లు చుట్టేసిన అభ్యర్థులు తమ దృష్టిని వలస ఓటర్లపై మళ్లించారు. జీవనోపాధికి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారిపై ఫోకస్ పెట్టారు. ఓటరు జాబితా ఆధారంగా వలస ఓటర్లను గుర్తిస్తూ ఫోన్లు చేస్తున్నారు.

వలస ఓటర్లే కీలకం.. ఒక్క ఓటునూ వదలకుండా ప్రయత్నం

- రవాణా ఖర్చులు, తాయిలాలు
- ఆన్‌లైన్‌లోనే ముందస్తుగా నగదు చేరవేత
- ఎక్కువ సంఖ్యలో ఉంటే వాహనాల ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాలో లక్షకుపైగా వలస ఓటర్లు
- నేటితో తొలివిడత ప్రచారం ముగింపు



సంగారెడ్డి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి మెదక్ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు రసవత్తరంగా జరుగుతున్నాయి. తొలివిడత ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియకు మరో 48 గంటల సమయం మాత్రమే మిగిలింది. దీంతో సర్పంచ్, వార్డు అభ్యర్థులు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. మిగిలిన సమయాన్ని ఓవైపు ప్రలోభాలకూ.. మరోవైపు వలస ఓటర్లను రప్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా లక్ష మందికి పైగానే వలస ఓటర్లు ఉంటారని అంచనా.

అభ్యర్థులకు కండీషన్లు

పల్లెల్లో హాట్‌హాట్‌గా ఎన్నికల హడావిడి ఉండడం.. అభ్యర్థుల మధ్య నువ్వానేనా అన్నట్లుగా పోటీ నెలకొనడంతో వలస ఓటర్లు తమకు అనువుగా మార్చుకుంటున్నారు. కొన్నిచోట్ల అభ్యర్థులకు వలస ఓటర్లే ఫోన్ చేసి తాము ఓటు వేయడానికి రావాలంటే రవాణా, ఇతర ఖర్చులు చెల్లించాలని అడుగుతున్నారు. ఇలా అందరు అభ్యర్థులకు కండీషన్లు పెడుతున్నారు. ఏ అభ్యర్థి ఫోన్ చేసినా వారికే మద్దతుగా మాట్లాడుతూ తమ ఫోన్‌పే నంబరు, అకౌంట్

మిగతా 7వ పేజీలో

నేటితో ప్రచారానికి తెర.. ఇక పంపిణీకి ఏర్పాట్లు

నేటితో తొలివిడత ఎన్నికల ప్రచారం ముగుస్తున్నందున ఇక ప్రలోభాలపై అభ్యర్థులు దృష్టి సారించారు. నేడు సాయంత్రం 5 గంటలకు మైకులు బంద్ అవుతాయి. బహిరంగ ప్రచారం చేస్తే ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించమే. అందుకే గుట్టుచప్పుడు కాకుండా ఓటర్లను కలుస్తూ ప్రసన్నం చేసుకోవడంలో నిమగ్నం కావడానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే మద్యం నిల్వలు తెచ్చిపెట్టుకున్నట్లుగా తెలుస్తోంది. ఎక్కడికక్కడ అభ్యర్థులు డబ్బు సైతం సమకూర్చుకున్నట్లుగా చర్చ జరుగుతోంది. అయితే ప్రత్యర్థుల ఎంతైతే పంపిణీ చేస్తారో అందుకు తగినట్లుగా పంపిణీ చేయడానికి అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు.

ఎన్నికల విధుల కేటాయింపులో
తప్పిదం!

- కొందరు ఉద్యోగులకు మూడు విడతల్లో విధులు
- మరికొందరికి పూర్తిగా మినహాయింపు!
- సాఫ్ట్‌వేర్‌పై అనుమానాలు..
- వివరణ కోరిన ఉన్నతాధికారులు

గజ్వేల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల విధుల కేటాయింపులో తప్పులు దొర్లినట్లు తెలుస్తోంది. జిల్లాలోని ఉద్యోగులకు విధుల కేటాయింపులో కొందరికి మూడు విడతల్లో విధులను కేటాయించగా, మరికొందరికి విధుల నుంచి మినహాయింపు ఇచ్చినట్లు తెలుస్తుంది. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఎంపిక చేసిన ఈ ప్రక్రియలో కొంత మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆయా సంఘాల నాయకులకు మినహాయింపు దక్కడంతో మిగతా వారి నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఈ నెల 11, 14, 17 తేదీల్లో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించనున్న నేపథ్యంలో, ఎన్నికల విధులకు ఆయా శాఖల ఉద్యోగులను, ఉపాధ్యాయులను జిల్లా అధికారులు ఎంపిక చేశారు. జిల్లాలోని ఆయా సంఘాలకు అనుబంధంగా, సన్నిహితంగా ఉండే ఉపాధ్యాయులు, ఉద్యోగులకు విధుల నుంచి మినహాయింపు దక్కడంతో ఏదో మతలబు నడిచిందని ఉద్యోగ, ఉపాధ్యాయుల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. తిరిగి వివరాలను పంపించాలని జిల్లా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఆయా శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు చెబుతున్నారు.

మహిళా ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఇబ్బందులు

ఆయా డివిజన్లలో జరిగే ఎన్నికల్లో పలువురు మహిళా ఉద్యోగ, ఉపాధ్యాయులకు మూడు విడతల్లో విధుల కేటాయింపు జరిగింది.

మిగతా 8లో...

నేడు మూడోవిడత విత్‌డ్రాలు

హుస్నాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మూడోవిడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణకు మంగళవారం వరకు గడువు ఉంది. అయితే మూడో విడత ఎన్నికలు హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, కొమురవెల్లి, కొండపాక, కుకునూరుపల్లి, దూళ్మిట్ట, మద్దూర్, చేర్యాల మండలాల్లోని 163 గ్రామ పంచాయతీలకు, 1432 వార్డుల్లో జరగనున్నాయి. ప్రస్తుతం 834 మంది సర్పంచ్ స్థానాలకు, 3,551 మంది వార్డు అభ్యర్థులు బరిలో ఉన్నారు. హుస్నాబాద్ మండలంలో 136 మంది సర్పంచ్ స్థానాలకు, 347 మంది వార్డు స్థానాలకు, కొమురవెల్లి మండలంలో 55 మంది సర్పంచ్‌లకు, 240 మంది వార్డులకు, కుకునూరుపల్లిలో 54 మంది సర్పంచ్‌లకు, 254 మంది వార్డులకు, అక్కన్నపేట మండలంలో 181 మంది సర్పంచ్‌లకు 696 మంది వార్డులకు, దూళిమిట్టలో 53 మంది సర్పంచ్‌లకు, 223 వార్డులకు, మద్దూర్‌లో 52 మంది సర్పంచ్‌లకు 265 మంది వార్డులకు, కోహెడలో 113 మంది సర్పంచ్‌లకు, 587 మంది వార్డులకు, చేర్యాలలో 110 మంది సర్పంచ్‌లకు 488 మంది వార్డులకు, కొండపాకలో 80 మంది సర్పంచ్‌లకు, 441 మంది వార్డుల్లో పోటీలో ఉన్నారు. అక్కన్నపేట మండలంలో 6 గ్రామ పంచాయతీలు, 84 వార్డులు, కోహెడ మండలంలో 1, కుకునూరుపల్లిలో రెండు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కానున్నాయి. ప్రత్యర్థి అభ్యర్థుల నామినేషన్లను విత్ డ్రా చేయించేందుకు రాత్రంతా కంటి మీద కునుకు లేకుండా కాళ్ల 'బేరాలు' సాగిస్తున్నారు.

ఈ సీజన్‌లోనే అత్యల్పం

- కోహీర్‌లో రాష్ట్రంలోనే రికార్డుస్థాయి కనిష్ఠ ఉష్ణోగ్రత
- ఉమ్మడి జిల్లాలో 43 ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ నమోదు

కోహీర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలో సోమవారం చలికాలంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. సంగారెడ్డి జిల్లాలోని కోహీర్‌లో 6.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. ఇది రాష్ట్రంలోనే అత్యల్పం. నవంబరు 29 నుంచి డిసెంబరు 4 వరకు ఉష్ణోగ్రతలు మెరుగ్గానే నమోదు కాగా, మూడు రోజులుగా గణనీయంగా పడిపోయాయి. సోమవారం ఉదయం వేళ ఉమ్మడి జిల్లాలోని 43 ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యాయి. సంగారెడ్డి జిల్లాలో 17 ప్రాంతాల్లో మెదక్ జిల్లాలో 16, సిద్దిపేట జిల్లాలో 10 ప్రాంతాల్లో పదిలోపు డిగ్రీలకు చేరింది.


మద్దూరు : చలిమంట కాచుకుంటున్న మద్దూరు ఎస్టీ కాలనీవాసులు

జిల్లాలో..

బేగంపేట్ 8.9, అంగడికిష్టాపూర్ 8.9, పోతిరెడ్డిపేట్ 8.9, తిప్పారం 9.0, నంగునూరు కొండపాక 9.1, అబ్బీపూర్ 9.5, గౌరారం 9.8, తుక్కాపూర్ 10.0, మునిగడప 10.0, ప్రాంతాల్లో సింగిల్ డిజిట్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా దూళ్మిట్ట 10.1, మిరుదొడ్డి 10.1, వెంకట్రావుపేట్ 10.2, రాంపూర్ 10.4, చిట్యాలపల్లి 10.4, ములుగు 10.5, రేబర్తి 10.6, కొమరవెల్లి 10.7, చిట్యాల 10.7 కనిష్ఠ ఉష్ణోగ్రతను నమోదు అయ్యాయి.

ఘనంగా పీవీ రాజేశ్వరరావు శత జయంతి వేడుకలు

- హాజరైన ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, సురభివాణి పాల్గొన్న పూర్వ విద్యార్థులు,

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వ్యవస్థాపక సభ్యుడు, మాజీ శాసనసభ్యులు పండరి వెంకట రాజేశ్వరరావు శత జయంతి వేడుకలను సోమవారం సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సునీత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య

మిగతా 8లో...


హాజరైన పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, పీవీ రాజేశ్వరరావు కుటుంబ సభ్యులు


సింగాటంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ హైమావతి

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ హైమావతి

గజ్వేల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ కేంద్రాల వద్ద పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కట్టా హైమావతి ఆదేశించారు. గజ్వేల్ మండల పరిధిలోని జాలిగామ, సింగాటం, శ్రీగిరిపల్లి గ్రామాల్లోని క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను ఆమె సోమవారం పరిశీలించి మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్ల వద్ద వెబ్‌కాస్టింగ్ పెట్టేందుకు సౌకర్యంగా ఉండాలని, లైవ్ వెబ్‌కాస్టింగ్‌కు ఇంటర్నెట్ సదుపాయం ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఓటరు స్లిప్‌ల పంపిణీని శత శాతం పూర్తి చేయాలని బీఎల్‌ఓలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ ఎంపీడీవో ఆరె ప్రవీణ్‌కుమార్, గజ్వేల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, ఎంపీవో దయాకర్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఆర్ఐ సంతోష్ తదితరులున్నారు.

ఏదైతే అది.. ఎకరం అమ్మేయ్!

- అభ్యర్థుల ఫాలోవర్ల అత్యుత్సాహం
- గెలుపు కోసం స్థిరాస్తులు తాకట్టు, మరికొందరు అమ్మకం
- వడ్డీ వ్యాపారుల వద్దకు పరుగులు
- తీరా ఓటర్ల నాడి అంతుచిక్కక ఆందోళన

గ్రామ పంచాయతీ ఎన్నికల బరిలో దిగిన అభ్యర్థులకు ప్రచారం ఖర్చు ఊహించని షాక్ ఇస్తోంది. ఫాలోవర్ల ఒత్తిడి... ప్రత్యర్థుల విందు, మందు రాజకీయాలతో ఖర్చు తడిసి మోపెడవుతుండటంతో, గెలుపు కోసం చివరి ప్రయత్నంగా సొంత స్థిరాస్తులను తాకట్టు పెట్టడానికో లేదా అమ్మేయడానికో సిద్ధమవుతున్నారు. "ఐదేళ్ల పదవి కోసం ఎకరం పొలం అమ్ముదాం" అనే పరిస్థితికి చేరుకున్నారు.

- చేర్యాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి)



గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో చేర్యాల మండలంలోని పలు గ్రామాలలో అభ్యర్థుల పరిస్థితి చర్చనీయాంశంగా మారింది. కొందరు అర్థ బలం ఉందని, మరికొందరు అంగబలం ఉందని, ఇంకొందరు పార్టీ అండ, చందాల భరోసా ఉందని, గతంలో చేసిన అభివృద్ధి ప్రభావితం చూపుతుందని అంచనా వేసుకుని నామినేషన్లు దాఖలు చేశారు. తీరా ఓటర్లను ప్రసన్నం చేసుకోవడం కోసం ప్రత్యర్థులు చేస్తున్న విందు, మందు రాజకీయాలు, వలస ఓటర్లను రప్పించేందుకు ప్రణాళికలు, ప్రచారం, ఇతరత్రా అంశాల విషయంలో తాము వెనుకబడుతున్నామని అభ్యర్థులు కిందామీద పడుతున్నారు. ఖద్దరు డ్రెస్‌పై ఉన్న మక్కువతో పోటీలో నిలబడినప్పటికీ, ఖర్చు బోలెడంత అవుతుండటంతో అభ్యర్థులు కంగుతింటున్నారు. ఈ విషయంలో పలువురు ఫాలోవర్లు చేస్తున్న నానా హంగామాతో అభ్యర్థులు పడరాని కష్టాలు పడుతున్నారు. "అంతా మనకే మంచిగా ఉంది, విజయం మనకే సొంతం. ఏమాత్రం వెనకడుగు వేయకూడదు. ఎదుటి వ్యక్తుల కంటే కొంచెం ఎక్కువ డబ్బులు పెట్టాలి" అని ఫాలోవర్లు పదే పదే సూచిస్తున్నారు. దీంతో, ఇప్పటికిప్పుడు డబ్బులు ఎక్కడినుండి తీసుకురావాలనే పరిస్థితి లేక అభ్యర్థులు తమ స్థిరాస్తిని తాకట్టు పెట్టడానికో లేదా విక్రయించాలని చూస్తున్నారు. "కొద్ది రోజులు కష్టపడితే ఐదేళ్లు పదవీ, అధికారం అనుభవించొచ్చు. ఏదైతే అది, ఎకరం పొలం అమ్ముదాం" అనే పరిస్థితి తీసుకువచ్చారు. దీంతో పలువురు అభ్యర్థులు డబ్బుల వేటలో పడి వడ్డీ వ్యాపారులు, సేల్‌డీడ్ చేసుకుని అప్పులు ఇచ్చే రియల్టర్ల వద్దకు పరుగులు పెడుతున్నారు. వారు ఎంత వడ్డీ అడిగితే అంతకు డబ్బు తెచ్చుకుంటున్నారు. అయితే, ఓటరు నాడి అంతు చిక్కక, ఇంత చేసినా విజయం దక్కుతుందో లేదోనని కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

పోతిరెడ్డిపల్లి ఘటనతో గుణపాఠం

చేర్యాల మండలంలోని పోతిరెడ్డిపల్లికి చెందిన ఓ అభ్యర్థి కోటి రూపాయల ఖర్చుకు వెనుకాడబోనని ముందు నుండి అత్యుత్సాహం

మిగతా 8లో...

600 చీరలు స్వాధీనం

పెద్దశంకరంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా పెద్దశంకరంపేట మండలం వీరోజిపల్లి గ్రామంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు తీసుకువచ్చిన 600 చీరలను పోలీసు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం పట్టుకుంది. సోమవారం సీఐ రేణుకారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టగా, వాహనంలో 600 చీరలు తరలిస్తుండగా పట్టుకున్నారు. గ్రామ సర్పంచ్ అభ్యర్థి మన్నె కృష్ణ హైదరాబాద్ నుంచి ఈ చీరలను తరలిస్తున్నారని సీఐ తెలిపారు.

పోరాటాల తీవ్రత పెంచాలి

- కార్మికులు ఎందుకు గుర్తించడం లేదు..
- సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్
- రెండో రోజు కొనసాగిన సీఐటీయూ మహాసభలు

మెదక్ కల్చరల్, డిసెంబర్ 7(ఆంధ్రజ్యోతి) ధిక్కరణ, ప్రతిఘటనల నినాదాలతో పోరాటాల తీవ్రతను పెంచాలని సీఐటీయూ అఖిలభారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ పిలుపునిచ్చారు. మెదక్ పట్టణంలో జరుగుతున్న సీఐటీయూ ఐదో రాష్ట్ర మహాసభలలో రెండో రోజు ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాల తీవ్రతను పెంచాలని అన్నారు. కార్మికులు సృష్టించిన సంపద, ఖనిజాలను కారు చౌకగా కార్పొరేట్లు ప్రభుత్వంలోని వారి ఏజెంట్ల ద్వారా దోచుకుంటున్నారని, వారికి వ్యతిరేకంగా దేశ కార్మికవర్గాన్ని ఐక్యం చేయటమే లక్ష్యంగా సమరశీల పోరాటాలు చేయాలన్నారు. 'దేశాన్ని రక్షించుకుందాం- ప్రజలని రక్షించుకుందాం' అనే స్ఫూర్తితో మహాసభలో తీర్మానాలు చేశామన్నారు. 76ఏండ్ల స్వాతంత్ర భారతంలో పోరాటాల ద్వారా సాధించుకున్న హక్కులను పాలకులు కాలరాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మోదవీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందన్నారు. పాలకులు స్వప్రయోజనాల కోసమే పని చేస్తున్నారని విమర్శించారు. ఇందుకు మీడియాను, ఇతర ఏజెన్సీలను వినియోగించుకుంటున్నదని, తద్వారా అబద్దాలను ప్రచారం చేస్తు నిజమని భ్రమ కల్పిస్తున్నారన్నారు. ఈ ప్రభుత్వం నయాఫాసిస్టు ధోరణితో పాలన కొనసాగిస్తున్నదని చెప్పారు. ప్రస్తుతం ప్రజాస్వామ్యం ప్రమాదంతో ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో మన ఆలోచన, మారుతున్న ప్రస్థితులను ఎదుర్కోవాలంటే.. ఖచ్చితమైన ప్రణాళిక అవసరమన్నారు. పోరాటాలతోనే సరిపెట్టకుండా ప్రజల ప్రయోజనాలను, వసతులపై దృషిట పెట్టాలని సూచించారు. పాలకుల కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటాల్లో కేసుల పాలవుతున్నామని, జైళ్లకు వెళ్తున్నామని, అయినా.. కార్మికులు మనల్ని ఎందుకు గుర్తించడం లేదో ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. కార్మికుల మధ్య అనైక్యతను పెంచేందుకు కులం, మతం, ప్రాంత విభేదాలను సృష్టిస్తున్నారని ఈ కుట్రలను కార్మికులు. ప్రజలు అర్థం చేసుకునేలా చైతన్యాన్ని కల్పించాలని అన్నారు. లేబర్ కోడ్ల విషయంలో ప్రతిపక్షాలన్నీ వ్యతిరేకించాయి దీనికి కారణం కూడా కార్మిక ఐక్య ఐక్యత. కర్నాటకలో ఒక రోజు సమ్మెతో 12 గంటల పనివిధానాన్ని తిప్పికొట్టిన విషయాన్ని గుర్తు చేశారు.పోరాటాలు, ఆందోళనలను మరింత ఉధృతం చేసేందుకు తగిన విధంగా కార్యాచరణ రూపొందించాలన్నారు. కార్యక్రమంలో చుక్క రాములు, ఎస్వీ రమ, భూపాల్, జె మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ కార్యవర్గ సభ్యులు

గుండెపోటు కాదు...ఆత్మహత్య

● పోస్టుమార్టం నివేదికలో తేలిన వాస్తవం

కొండాపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కొండాపూర్ మండలం మల్కాపూర్‌లో నివాసముంటున్న ప్రభుత్వ టీచర్ శ్రీనివాస్ తనభార్య సుచిత గుండెపోటుతో మృతిచెందినట్లు చెప్పిన మాట అవాస్తమని తేలింది. ఇంట్లో ఉరేసుకోవడంతో మృతిచెందినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలింది. కొండాపూర్ సీఐ సుమన్ వివరాల ప్రకారం... ప్రభుత్వ టీచర్ అయిన శ్రీనివాస్ అతని భార్య సుచితలు మల్కాపూర్‌లో నివాసముంటున్నారు. కొంతకాలంగా ఆస్తి విషయమై గొడవపడేవారు. ఆదివారమూ గొడవపడ్డారు. సుచిత ఇంట్లో బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన భర్త శ్రీనివాస్ ఏంచేయాలో తెలియక ఆమె గుండెపోటుతో మృతిచెందినట్లు బంధువులకు తెలిపాడు. అంత్యక్రియలు నిర్వహిస్తున్న సమయంలో సుచిత మెడ చుట్టూ మరకలు, ఇతర ఘాట్లు ఉండటం గమనించిన బంధువులకు అనుమానం వచ్చి కొండాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సుచిత మృతదేహానికి సోమవారం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఉరేసుకోవడం వల్లనే సుచిత మృతిచెందినట్లు పోస్టుమార్టం నివేదికలో తేలింది. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సుమన్‌కుమార్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

లక్షన్నర నగదు పట్టివేత

కల్హేర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన కల్హేర్, మండల పరిధిలోని మాసాన్‌పల్లి గ్రామాల నడుమ రహదారిపై బైకుపై తీసుకెళ్తున్న రూ.1.50 లక్షల నగదును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రవిగౌడ్ సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన సంగున్‌గారి అఖిల్‌గౌడ్ తన ద్విచక్ర వాహనంపై మాసాన్‌పల్లి చౌరస్తా నుంచి కల్హేర్ వైపు వస్తుండగా పోలీసులు తనిఖీ చేశారు. దీంతో లక్షన్నర నగదు లభించడంతో స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రజలతో మమేకం కోసమే 'ప్రజావాణి'

● సంగారెడ్డి ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలతో మరింత మమేకం కావడం కోసమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని సంగారెడ్డి ఎస్పీ పంకజ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల ఆర్జీదారుల నుంచి ఆయన ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుదారులు చెప్పిన సమస్యలను ఓపికగా విన్నారు. సమస్య పరిష్కారం కోసం స్థానికంగానే కృషి చేయాలని పోలీసులకు సూచించారు. ప్రజావాణి ద్వారా సమస్యలు సత్వరం పరిష్కారమవుతాయని ఎస్పీ వెల్లడించారు.

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

మెదక్ అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పోలీసు ప్రజావాణి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసులకు ఫోన్‌లో ఆదేశించారు.

మద్యం బాటిళ్లు సీజ్

● కేసు నమోదు చేసుకున్న పోలీసులు

వట్‌పల్లి/వెల్దుర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కారులో అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను పట్టుకున్నట్లు జోగిపేట సీఐ అనిల్‌కుమార్, వట్‌పల్లి ఎస్‌ఐ లవకుమార్ సోమవారం తెలిపారు. వట్‌పల్లి నుంచి మండలంలోని పోతులబొగుడ గ్రామానికి అక్రమంగా కారులో మద్యం తరలిస్తున్నట్లు నమ్మదగిన సమాచారంతో ఆ వాహనాన్ని తనిఖీ చేయగా రూ.1.02 లక్షల విలువ చేయడంతో 117 లీటర్ల మద్యం పట్టుబడిందన్నారు. అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. వెల్దుర్తి మండలంలోని కుకునూర్ గ్రామానికి చెందిన లక్ష్మీకాంత్ కిరాణ దుకాణంలో అక్రమంగా నిల్వ చేసిన 3.24 లీటర్ల మద్యాన్ని ఎలుకపల్లి గ్రామం మీదుగా మరో వ్యక్తి యశ్వంతరావు పేట గ్రామం వైపు తరలిస్తున్న 34 బీరు బాటళ్లను పట్టుకొని, సంబంధిత వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యవస్థను సవ్యదిశలో నడిపే రచనలు రావాలి

● కలవార కవిత్వ సంపుటి ఆవిష్కరణ సభ



కలవార పుస్తకావిష్కరణ దృశ్యం

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కాల ప్రవాహంలో పడి కొట్టుకుపోయే వారికంటే, కాలంకన్నా ఒకక్షణం ముందు నిలబడి రాబోయే ఉపద్రవాన్ని పసిగట్టి సమూహాన్ని అప్రమత్తం చేసేవారే కవులు రచయితలుగా నిలదొక్కుకోగలుగుతారని తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కొండి మల్లారెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సీనియర్ కవి మహమూద్ పాషా కవిత్వ సంపుటి కలవార ఆవిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మూడు దశాబ్దాల క్రితమే ప్రపంచీకరణ ప్రభావం వల్ల రాబోయే పరిణామాలను, పర్యవసానాలను గమనించిన కవులు, రచయితలు తమ రచనల ద్వారా ముందస్తు హెచ్చరికలు చేస్తే అందరూ తేలికగా కొట్టిపారేశారని, ఇప్పుడు అన్నివైపుల నుంచి చాపకింద నీరులా తస్తే తప్పా దాని దుష్పరిణామాలు తెలిసిరాలేదన్నారు. సీనియర్ కవి మహమూద్ పాషా 40 ఏళ్లుగా సాహిత్య సేద్యం చేస్తూ తన రెండవ పుస్తకంగా కలవారను ప్రచురించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు పర్కపెల్లియాదగిరి, గఫూర్ శిక్షక్, కార్యదర్శులు ఉప్పలపద్మ, ఆడెపు లక్షణ్, తౌడబోయిన తిరుపతి, వంగర నరసింహారెడ్డి, అశోక్ రాజు, కొమురవెల్లి అంజయ్య, స్రవంతి మహిపాల్, మోర మోహన్, త్రివిక్రమశర్మ, ఉమాశంకర్, మహేందర్, సుధాకర్, శ్రీధర్, ఎడ్ల లక్ష్మి, వెంకటేశ్వర్లు, సాజిత్, సర్దార్ హుస్సేన్, కవులు రచయితలు సాహిత్యాభిమానులు, మహమూద్ పాషా బంధుమిత్రులు పాల్గొన్నారు.

51 మంది బైండోవర్

మనూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మనూరు మండలంలోని గ్రామాల్లో బెల్ట్‌షాప్‌లో మద్యం విక్రయిస్తున్న వారిపై మూడు కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ కోటేశ్వరరావు తెలిపారు. సోమవారం సాయంత్రం బెల్లాపూర్ సమీపంలో జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ సహకరించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎన్నికల సందర్భంగా 51 మందిని బైండోవర్ చేసినట్లు తెలిపారు.

పాముకాటుతో యువ రైతు మృతి

మాసాయిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పాముకాటుతో యువరైతు మృతిచెందాడు. మాసాయిపేటకు చెందిన దొంతి ఆంజనేయులు(44) సోమవారం ఉదయం చెట్లతిమ్మాయిపల్లి శివారులోని తన పొలం వద్ద పనిచేస్తూ పాముకాటుకు గురయ్యాడు. వెంటనే అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

చిన్నశంకరంపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చిన్నశంకరంపేట మండలం జంగరాయి గ్రామంలో సోమవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన గడ్డం మానయ్య(42) కొన్నిరోజులుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. మనోవేనకు గురై మద్యం మత్తులో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రామాయంపేట సీఐ వెంకటరాజాగౌడ్, ఎస్‌ఐ నారాయణగౌడ్ ఘటనా స్థలానికి చేరుకొని విచారించారు. మృతుడి భార్య సంపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కోతుల దాడిలో ముగ్గురికి తీవ్రగాయాలు

చేగుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కోతుల దాడిలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. చేగుంటకు చెందిన పూలబోయిన యాదమ్మ, బీస్వప్న, మురడి స్వామిపై సోమవాం కోతులు దాడిచేశారు. చేగుంటలో ప్రథమ చికిత్స అనంతరం వారిని మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చేగుంటలో కోతుల బెడద ఉండడంతో రోజు ఏదో ఒకచోట దాడి చేస్తూనే ఉన్నాయి. కోతుల బెడద నుంచి కాపాడాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో గడ్డి ట్రాక్టర్ ధ్వసం

మనోహరాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో గడ్డి ట్రాక్టర్ ధ్వంసమైన సంఘటన కాళ్లకల్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చీర్ల మల్లేష్‌యాదవ్ గ్రామంలోని తన పొలం నుంచి ట్రాక్టర్‌లో గడ్డిని నింపుకుని వస్తున్నాడు. హనుమాన్ ఆలయం వద్ద విద్యుత్ వైర్లు తగిలి ట్రాక్టర్ ట్రాలీ, గడ్డి దగ్ధమైంది. సుమారు రూ.లక్ష వరకు నష్టం జరిగిందని బాధితుడు తెలిపాడు.

రైస్‌మిల్లుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు


జోగిపేట రూరల్, డిసెంబర్8 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారన్న సమాచారంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించిన ఘటన అందోల్ మండంలో జోగిపేటలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం.. అందోల్ మండలం జోగిపేట పట్టణంలోని సత్యవతి ట్రేడర్స్ అనే రైస్ మిల్లు లో పీడీఎస్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం రావడంతో స్థానిక పోలీసుల తో కలిసి సోమవారం రైస్ మిల్లుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు జరిపారు. సుమారు 45సంచుల బియ్యాన్ని ఇన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. విజిలెన్స్ అధికారులు మంగళవారం వచ్చి ఆ బియ్యాన్ని పరిశీలించనున్నట్లు ఎస్‌ఐ పాండు తెలిపారు.

చోరీకి గురైన 110 మొబైల్ ఫోన్ల రికవరీ

మెదక్ అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా పరిధిలో ఇటీవలి కాలంలో దొంగతనానికి గురైన 110 మొబైల్ ఫోన్లను గుర్తించి, వాటిని బాధితులకు సోమవారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావు జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసి మాట్లాడారు. మొబైల్ ఫోన్లు చోరీకి గురైన పౌరులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తమ ఫోన్లను ట్రాక్ చేసి తిరిగి పొందే అవకాశం ఉందన్నారు. మొబైల్‌ఫోన్లు అందుకున్న బాధితులు ఎస్పీతోపాటు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, ఐటీకోర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'స్థానికం'తో మొదలై.. అంచెలంచెలుగా ఎదిగి..

- ఏకగ్రీవ సర్పంచ్ నుంచి డిప్యూటీ స్పీకర్ వరకు ఐరేని లింగయ్య
- సర్పంచ్ నుంచి మంత్రి వరకు వెలిగిన 'ముత్యం'
- రాజ్యసభ సభ్యుడిగా 'సోలిపేట' ప్రస్థానం



దుబ్బాక నియోజకవర్గ మ్యాప్

దుబ్బాక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పల్లెలు దేశానికి పట్టుగొమ్మలంటారు.. పల్లెలను ఏలినవాళ్లకు పాలనపై పట్టు ఉంటుందంటారు. అలాంటి పల్లెల నుంచి అంచలంచెలుగా ఎదిగిన నలుగురు ప్రజల మదిలో చెరగని ముద్ర వేసుకున్నారు. ప్రజా జీవితంలో తమదైన అభివృద్ధిని లిఖించారు. వారే దివంగత నేత, డిప్యూటీ సీఎం ఐరేని లింగయ్య, మాజీ రాజ్యసభ సభ్యుడు, దివంగత నేత సోలిపేట రామచంద్రారెడ్డి, మాజీ మంత్రి, దివంగత నేత చెరుకు ముత్యంరెడ్డి.

ధిక్కార స్వరం ఐరేని లింగయ్య



తెలంగాణ విముక్తి పోరాటంలో పాల్గొన్న ఐరేణి లింగయ్యను 1952లో అప్పటి బూర్గుల రామకృష్ణారావు ప్రభుత్వం దుబ్బాకకు సర్పంచ్‌గా నామినేట్ చేసింది. ఆ తర్వాత కాంగ్రెస్ కీలక రాజకీయాల్లో పాల్గొన్నారు. 1958లో నీలం సంజీవరెడ్డి హయాంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విధాన పరిషత్ (శాసనమండలి) ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి ఆయన మూడుసార్లు (1978 వరకు) ఎమ్మెల్సీగా కొనసాగారు. 1978లో అప్పటి దొమ్మాట(ప్రస్తుత దుబ్బాక) నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా బరిలో నిలపగా టీజేపీ అభ్యర్థి సీ.రామారావుపై గెలుపొందారు. 1983లో టీడీపీ గాలిలో కూడా ఆయన దొమ్మాట నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు.

కొట్లాడి డిప్యూటీ స్పీకర్ పదవి



దుబ్బాక- సిద్దిపేట నియోజకవర్గాల మధ్య మొదటి నుంచే రాజకీయ వైరం ఉండేది. అది ఎమ్మెల్యే ఐరేణి లింగయ్య కాలం నుంచే ప్రారంభమైంది. తనకంటే జూనియర్ అయిన సిద్దిపేట ఎమ్మెల్యే అనంతుల మదన్‌మోహన్‌కు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి పదవి ఇవ్వడంతో లింగయ్య కాంగ్రెస్‌పై కినుకు వహించారు. 1982లో కోట్ల విజయభాస్కర్‌రెడ్డి సీఎంగా ఉండి లింగయ్యకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చారు. ప్రోటోకాల్ ప్రకారం అనంతుల మదన్‌మోహన్ మంత్రిగా డిప్యూటీ స్పీకర్ ఐరేణి లింగయ్యకే గౌరవం ఇవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. కేవలం ఐదో తరగతి వరకు చదివిన ఐరేణి లింగయ్య డిప్యూటీ స్పీకర్‌గా పనిచేశారు.

దుబ్బాక అభివృద్ధిలో తనదైన ముద్ర

మూలగట్టు ప్రాంతంగా వివక్షకు గురైన దుబ్బాకకు లింగయ్య అభివృద్ధి బాటలు వేశారు. సర్పంచ్‌గా దుబ్బాక నుంచి హబ్షీపూర్ రహదారికి బాటలు వేశారు. దుబ్బాక తాలుకాను, దుబ్బాక సమితిని ఏర్పాటు ఏర్పాటు చేశారు. తాను ఎమ్మెల్యేగా దుబ్బాకలో డాగ్‌బంగ్లా నిర్మాణం, తహసీల్దార్ కార్యాలయం, గ్రంథాలయం ఏర్పాటు, 20 పడకల ఆసుపత్రి ఏర్పాటు, బ్లాక్ ఆఫీస్ కార్యాలయం (ప్రస్తుత కోర్టు భవనం), పాత బస్టాండ్ నిర్మాణం, గ్రామపంచాయతీ భవన నిర్మాణం ఆయన హయాంలోనే జరిగాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో కేవలం దుబ్బాక మండలం రామక్కపేటలో గురుకుల బాలికల పాఠశాలను ఏర్పాటు చేయించారు.

ఉద్యమకారుడు సోలిపేట రామచంద్రారెడ్డి



సోలిపేట రామచంద్రారెడ్డి అప్పటి దుబ్బాక మండలం (ప్రస్తుతం అక్బర్‌పేట-భూంపల్లిమండలం) చిట్టాపూర్ మొదటి సర్పంచ్‌గా 24 ఏళ్లకే రాజకీయ ప్రస్థానం చేశారు. 1955 నుంచి 1965 వరకు సర్పంచ్‌గా అనేక సేవలందించారు. విద్యార్థి దశలోనే సోషలిస్టు భావజాలానికి ఆకర్షి తుడైన రామచంద్రారెడ్డి తొలితరం కమ్యూనిస్టుగా ఆనాడు ఉధృతంగా సాగుతున్న తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్నారు. సిటీ కాలేజీలో ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో స్టూడెంట్స్ యూనియన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత దుబ్బాక సమితి అధ్యక్షుడిగా ఉన్నారు. రెండేళ్లపాటు సిద్దిపేట వ్యవసాయ కమిటీ చైర్మన్‌గా ఉన్నారు. 1972లో కాంగ్రెస్ తరఫున దొమ్మాట ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కొంతకాలం మెదక్ జిల్లా సహకార బ్యాంకు చైర్మన్‌గా, ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ సంస్థ అధ్యక్షుడిగా కొనసాగారు. ఆ తర్వాత రామచంద్రారెడ్డి టీడీపీ నుంచి రాజ్యసభకు ఎంపికై 1996-2002 వరకు ఫ్లోర్‌లీడర్‌గా ఉన్నారు. ఎన్టీఆర్ సీఎంగా ఉన్న సమయంలో పంచాయతీ, మండల వ్యవస్థ రూపకల్పనలో ప్రధానపాత్ర పోషించారు. టీడీపీలో చంద్రబాబుకు కూడా మంచి సలహాదారులుగా కొనసాగారు. దివంగత ప్రజాకవి సీ.నారాయణరెడ్డి వియ్యంకుడిగా ఇద్దరూ టీడీపీలో కీలకంగా పనిచేశారు.

పల్లెకు అభివృద్ధిని రప్పించిన 'ఆణిముత్యం'



పల్లెకు అభివృద్ధిని రప్పించిన ఆణిముత్యం దివంగత మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి. 1969-1988 వరకు తొగుట సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం చేశారు. 1988-1989 ఉమ్మడి మెదక్ జిల్లా కోఆపరేటివ్ డైరెక్టర్ పనిచేసిన ఆయనను 1989లో అనూహ్యంగా టీడీపీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో దింపే అవకాశం వచ్చింది. 1989-2004 వరకు దొమ్మాట ఎమ్మెల్యేగా, 2002- 2004 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాలశాఖ మంత్రిగా పనిచేశారు. 2005-2006 వరకు టీడీపీ జిల్లా అధ్యక్షుడిగా, 2007-2009 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కిసాన్ సెల్ అధ్యక్షుడిగా పనిచేశారు. కాంగ్రెస్‌లో చేరిన ఆయన 2009-2014 దుబ్బాక ఎమ్మెల్యేగా, రెండు పర్యాయలుగా అంచనాల కమిటీ చైర్మన్‌గా, రెండు పర్యాయాలుగా తిరుమల తిరుపతి దేవస్థానం డైరెక్టర్ సేవలందించారు.

అప్పుడు భార్యలు.. ఇప్పుడు భర్తలు..

- అల్లాపూర్ సర్పంచ్ బరిలో...


అంకెన్‌పల్లి నారాయణ, కొల్యూరి శంకరయ్య

మునిపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం అల్లాపూర్ గ్రామం మల్లికార్జున్‌పల్లి అమ్లేట్ విలేజ్‌గా ఉండేది. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో నూతన గ్రామపంచాయతీల ఏర్పాటులో భాగంగా 2019లో అల్లాపూర్ గ్రామపంచాయతీగా ఏర్పాటైంది. 2019 సర్పంచ్ ఎన్నికల్లో బీసీ మహిళా రిజర్వేషన్ రావడంతో అంకెన్‌పల్లి నాగరాణి(బీఆర్ఎస్), కొల్యూరి విశ్వజ్యోతి(కాంగ్రెస్) నుంచి బరిలో నిలవగా.. 244 ఓట్ల మెజార్టీలో నాగరాణి గెలుపొందింది. అనంతరం జరిగిన పరిణామాల వల్ల మాజీ సర్పంచ్ నాగరాణి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అప్పుడు భార్యలు పోటీలో ఉంటే ఇప్పుడు వారి భర్తలైన అంకెన్‌పల్లి నారాయణ, కొల్యూరి శంకరయ్య ఇద్దరూ కాంగ్రెస్ మద్దతుతో బరిలో నిలిచారు. ఇటు నారాయణ మాత్రం ఐదేళ్లపాటు చేసిన అభివృద్ధే గెలిపిస్తుందని ధీమాతో ఉండగా.. అటు శంకరయ్య మాత్రం గ్రామం అభివృద్ధికి నోచుకోలేదని ప్రచారం చేస్తున్నారు. మరి ప్రజలు ఎవరిని గెలిపిస్తారో వేచిచూడాలి.

కుక్కల బెడద లేకుండా చేసే వారికే మా ఓటు

- గ్రామాల్లో తేల్చి చెబుతున్న ఓటర్లు


కల్హేర్‌లో నివాస గృహాల మధ్య సంచరిస్తున్న కుక్కల గుంపులు

కల్హేర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటు అడిగేవారు ముందు కుక్కలు, కోతుల బెడద తొలిగిస్తామని మాట ఇస్తేనే తాము ఓటు వేస్తామని అధికశాతం గ్రామాలకు చెందిన ఓటర్లు తమ మనోగతాన్ని బయటపెట్టారు. కుక్కల గుంపుల సంచారం ఫలితంగా కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోని అధికశాతం గ్రామాల్లో చిన్నారులను, వృద్ధులను, మహిళలను కుక్కలు కరవడంతో తీవ్రగాయాలైన సంఘటనలూ ఉన్నాయి. ప్రస్తుతం గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీచేసే ఏ పార్టీ అభ్యర్థి అయినా తమ గ్రామాల్లో సర్పంచ్‌గా ఎన్నికయ్యాక కుక్కలు, కోతుల బెడద తొలిగించాల్సిందేనని ఓటర్లు అంటున్నారు. ఈ మేరకు ముందుగా హామీఇవ్వాలని ఓటర్లు డిమాండ్ చేస్తున్నారు.

పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం


నరసింహులపల్లిలో నూతన పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఆర్వో

బెజ్జంకి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రెండో విడత పంచాయతీ ఎన్నికల్లో ఏకగ్రీవమైన మండలంలోని నరసింహులపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గసభ్యులచే సోమవారం ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ డీ.సుధాకర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం చేయించారు. సర్పంచ్‌గా జెట్టి రమేష్, ఉపసర్పంచ్‌గా జెట్టి శ్రీకాంత్, వార్డుసభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. నూతన పాలకవర్గసభ్యులు గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్థులు పాల్గొన్నారు.

'పల్లె' పోరుపై యువత గురి

- సర్పంచ్‌గా పోటీ చేసేందుకు ఆసక్తి
- ఎక్కువ స్థానాలో బరిలో నిలిచిన మహిళలు

తొగుట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మారుమూల గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకు రావడానికి యువత ఆలోచించి పల్లెపోరులో బరిలోకి దిగారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని 17 గ్రామపంచాయితీలకు ఈనెల 14న రెండోవిడత ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో 58 మంది అభ్యర్థులు సర్పంచ్ పదవి కోసం పోటీలో నిల్చున్నారు. అందులో అత్యధికంగా 25-40 ఏళ్లలోపు ఉన్నవారు పోటీలో నిలబడటం విశేషం. మండలంలోని తొగుట, తుక్కాపూర్, గోవర్ధనగిరి, గుడికందుల, లింగంపేట, చందాపూర్, బండారుపల్లి, వెంకట్రావ్‌పేట గ్రామాల్లో మొదటిసారి కొందరు మహిళలు పోటీలో నిలబడుతుండగా పెద్దమాసాన్‌పల్లి, రాంపూర్, కాన్గల్, ఎల్లారెడ్డిపేట, వర్ధరాజ్‌పల్లి, జప్తిలింగారెడ్డిపల్లి, ఘనపూర్, లింగాపూర్, ఎల్ బంజర్‌పల్లి గ్రామాల్లో యువకులు సర్పంచ్ పదవి కోసం మొదటిసారి బరిలో నిలిచి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో రాజకీయం యువతీ, యువకుల చుట్టూ తిరుగుతుంది. గతంలో 40-50 ఏళ్ల పైబడిన వారు మాత్రమే సర్పంచ్ పదవిలో ఏళ్ల తరబడి కొనసాగేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. దీనికితోడు చదువుకున్న వారు, నిరుద్యోగులు రాజకీయాల్లో పట్టు నిలుపుకునేందుకు పోటీపడుతున్నారు.

రారండోయ్..!

(5వ పేజీ తరువాయి)

వివరాలను పంపిస్తున్నారు. పలు గ్రామాల్లో ఇప్పటికే వలస ఓటర్లకు రూ.1000 నుంచి రూ.3 వేల దాకా పంపించిన పరిస్థితి కనిపిస్తోంది. తమ పనులు వదిలి రావాల్సి ఉంటుందని.. ఆ డబ్బుతోపాటు ఓటుకు కొంత సైతం వసూలు చేస్తున్నారు. అభ్యర్థులు కూడా కిమ్మనకుండా అడిగినంత ఇస్తున్నారు.

ప్రతీ ఓటుపై దృష్టి

గ్రామ పంచాయతీ, వార్డు ఎన్నికల్లో ప్రతీ ఓటు కీలకమే. గతంలో జరిగిన ఎన్నికల్లో ఒకటి రెండు ఓట్లతోనే ఓడిపోయిన అభ్యర్థులు ఉన్నారు. ముఖ్యంగా వార్డుల్లో ఒక్క ఓటు కూడా ప్రభావం చూపిస్తుంది. హోరాహోరీగా పోటీ ఉన్న గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు ప్రతీ ఓటుపై దృష్టి సారించారు. గ్రామాల్లో ఉన్న ఓటర్లకు అందరితో సమానంగా డబ్బు, మద్యం అందించి.. ఇతర ప్రాంతాల్లో ఉన్నవారి విషయంలో పెద్ద మనసు చేసుకుంటున్నారు. ముఖ్యంగా హైదరాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్‌తోపాటు బెంగళూరు, బీదర్, ముంబయి, బీవండి, సూరత్, నాగ్‌పూర్, నాందేడ్ నగరాల్లో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఎక్కువమంది బతుకుదెరువు కోసం తరలివెళ్లారు. వీరి ఓట్లన్నీ గ్రామాల్లోనే ఉన్నాయి. ఓటర్ల సంఖ్య ఆధారంగా ప్రత్యేక వాహనాలను సైతం ఏర్పాటు చేయిస్తున్నారు. హైదరాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట ప్రాంతాల్లో ఉన్న ఓటర్ల వద్దకు స్వయంగా అభ్యర్థులే వెళ్లి ఖర్చులు సమర్పించుకొని వస్తున్నారు. ఒక్క ఓటు తేడాతో ఓడిపోతే పెట్టిన ఖర్చులతోపాటు తమ రాజకీయ జీవితం కూడా ఇరకాటంలో పడుతుందని ప్రతీ ఓటును ప్రాధాన్యంగా తీసుకుంటున్న పరిస్థితి ప్రస్తుత ఎన్నికల్లో కనిపిస్తోంది.

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు

- పంచాయతీ ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేశ్


మాట్లాడుతున్న ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేశ్

పుల్‌కల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణలో సజావుగా జరిగేలా సహకరించాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రాకేశ్ అన్నారు. మండల కేంద్రమైన చౌటకూర్ రైతువేదికలో మండలంలోని వివిధ గ్రామాల్లో సర్పంచ్, వార్డు పదవులకు పోటీచేస్తున్న అభ్యర్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. సర్పంచ్ అభ్యర్థులు రూ.1.50 లక్షలు, వార్డు అభ్యర్థులు రూ.30 వేలు మించకుండా ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిష్టయ్య, ఎంపీడీవో కే.శంకర్, మండల ఎన్నికల వ్యయ పరిశీలకులు నిరంజన్, మండల ప్రత్యేకాధికారి వసంతకుమారి, ఎంపీవో సువర్ణ, ఫ్లయింగ్ స్క్వాడ్ టీం, అకౌంట్స్ టీం సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధన మేరకే ఖర్చు చేయాలి

చేగుంట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో పోటీచేసే ప్రతీ అభ్యర్థి ఎన్నికల ఖర్చులు బ్యాంకు ద్వారా లావాదేవీలు జరపాలని మండల ఎన్నికల ఎక్స్‌పెండేచర్ అధికారి శ్రేయ పేర్కొన్నారు. సోమవారం చేగుంట రైతువేదికల్లో మండలంలోని సర్పంచ్, వార్డు అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ఖర్చులపై ఎంపీడీవో చిన్నారెడ్డితో కలిసి పోటీచేసే అభ్యర్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ శ్రీశైలం, వివిధ గ్రామాల సర్పంచ్, వార్డుసభ్యుల అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

మైక్రో అబ్జర్వర్లు నిబద్ధతతో పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భారతి లక్పతినాయక్

మెదక్ అర్బన్/మెదక్ కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల పోలింగ్ విధుల పట్ల మైక్రో అబ్జర్వర్లు నిబద్ధతతో పనిచేయాలని జిల్లా సాధారణ పరిశీలకులు భారతి లక్పతినాయక్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో అబ్జర్వర్లకు ఏర్పాటు చేసిన విధివిధానాల శిక్షణ కార్యక్రమంలో అధికారులతో కలిసి పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని గ్రామపంచాయతీలకు 82 మంది మైక్రో అబ్జర్వర్లను కేటాయించామన్నారు. ఎన్నికల నియమావళి అనుసరించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఎన్నికల కోడ్‌ను తప్పకుండా అమలు చేయాలన్నారు. ఏంసీసీ, ఎంసీఎంసీ, ఎస్ఎస్‌టీ బృందాల అధికారులతో ఆమె సమీక్షించారు. పోటీచేసే అభ్యర్థులు ప్రకటనల కోసం అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశాల్లో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, డీఎస్‌వో రాజిరెడ్డి పాల్గొన్నారు. మెదక్ జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో నేపథ్యంలో మద్యం, డబ్బు నియంత్రణ చేయాలని ఎన్నికల సాధారణ అబ్జర్వర్ భారతి లక్పతినాయక్ అన్నారు. సోమవారం మంబోజిపల్లి చెక్ పోస్టులను సందర్శించి అక్కడ ఏర్పాటు చేసిన తనిఖీ వ్యవస్థలు, వాహనాల పరిశీలన, నగదు-వస్తువుల కదలికలపై చేస్తున్న నియంత్రణ చర్యలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తహసీల్దార్ పాల్గొన్నారు.

కాళ్లు మొక్కుతా... కనికరించి ఓటే వేయండి..


హైదరాబాద్‌లో ఓటరు కాళ్లు మొక్కుతున్న ఆంజనేయులుగౌడ్

చేర్యాల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : గ్రామపంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పలువురు అభ్యర్థులు వినూత్న ప్రచారం చేస్తూ ఆకర్షిస్తున్నారు. చేర్యాల మండలం చిట్యాల గ్రామానికి చెందిన పలువురు వలస ఓటర్లు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. గ్రామంలో 8వ వార్డు స్థానానికి పోటీచేస్తున్న పంజాల ఆంజనేయులు సోమవారం హైదరాబాద్ ప్రాంతంలోని తమ గ్రామ వలస ఓటర్లను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. సన్నిహితంగా మెదలిన వారి పట్ల కాళ్లు మొక్కి తనకే ఓటేయాలని ప్రాధేయపడ్డారు. విషయాన్ని స్థానికులు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో వైరల్ అయ్యింది.

పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య



సఖి కేంద్రంలో సమస్యలపై మాట్లాడుతున్న కార్యదర్శి సౌజన్య

సంగారెడ్డి క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి బీ.సౌజన్య ఆదేశించారు. సంగారెడ్డిలోని శిశు గృహ, సఖి కేంద్రాన్ని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. శిశు గృహంలోని పిల్లల ఆరోగ్యం పట్ల నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం సఖి కేంద్రాన్ని సందర్శించి బాధితులతో మాట్లాడారు. ఎవరికైనా న్యాయ సహాయం అవసరమైతే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఐఐటీహెచ్‌లో ముగిసిన అంతర్జాతీయ సదస్సు


ముగింపులో ఖనిజ పరిశోధకులు, శాస్త్రవేత్తలు, ఐఐటీహెచ్ అధ్యాపకులు

కంది, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెటల్స్ (ఐఐఎం) 79వ వార్షిక సాంకేతిక సమావేశం సోమవారం ముగిసింది. ఇది దేశంలోని మెటలర్జికల్, మెటీరియల్ సైన్స్ నిపుణుల అత్యంత ముఖ్యమైన సమావేశాల్లో ఒకటిగా నిలిచింది. ఈ సదస్సులో 1600 మంది ఖనిజాల పరిశోధకులు, శాస్త్రవేత్తలు, 1000 సాంకేతిక పత్రాలు, 110 ఆహ్వానించబడిన చర్చలు, ఏడు దేశాల నుంచి నిపుణులు 45 సంస్థల నుంచి ఆవిష్కరణలను ప్రదర్శించారని ఐఐటీహెచ్ అధికారులు వెల్లడించారు. ఇది దేశంలోనే పెద్ద సాంకేతిక, లోహ పదార్థాల పరిశోధన పర్యావరణ వ్యవస్థకు కొత్త ప్రమాణాన్ని ఏర్పాటు చేసింది. కీలకమైన ఖనిజాలు, శక్తి పరివర్తన, అధునాతన తయారీపై జాతీయ దృష్టి సారించడంతో ఈ కార్యక్రమం భారతదేశం ఆత్మనిర్భర్ భారత్‌లో భాగమైంది. జాతీయ ప్రాముఖ్యతను జోడిస్తూ కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి ఆన్‌లైన్ ద్వారా ఒక ప్రత్యేక సందేశం ఇచ్చారు. కీలకమైన ఖనిజ భద్రత, స్వచ్ఛమైన ఇంధన పరివర్తన, సాంకేతిక స్వావలంబన కోసం భారతదేశం యొక్క ప్రణాళికలకు ఈ సదస్సు కీలకమైనదని ప్రశంసించారు. కీలకమైన పదార్థాల వెలికితీత, శుద్ధి, పునర్వినియోగంలో స్కేలబుల్ పరిష్కారాలను అభివృద్ధి చేయడం ద్వారా సైన్స్, పరిశ్రమలను వారధి చేయాలని ఆయన పరిశోధకులను కోరారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ భారతదేశం పదార్థాల ఆవిష్కరణ, కీలకమైన ఖనిజాల భద్రత స్థిరమైన తయారీ వైపు తన ప్రయాణంలో ఒక నిర్ణయాత్మక క్షణంలో ఉందని కొనియాడారు. సమగ్ర భాగస్వామ్యం, అధిక-నాణ్యత సాంకేతిక సహకారాలు, ప్రపంచ సహకారాలు, స్ఫూర్తిదాయక నాయకత్వంతో, ఐఐటీ హైదరాబాద్ నిర్వహించిన ఈ కార్యక్రమం లోహశాస్త్రం, మెటీరియల్ సైన్స్ అధునాతన సాంకేతికతలలో పెరుగుతున్న ప్రపంచ శక్తి కేంద్రంగా భారతదేశం ఆవిర్భావాన్ని బలోపేతం చేసిందని బీఎస్ మూర్తి వెల్లడించారు

మెజారిటీ సర్పంచ్ స్థానాలు గెలుస్తాం

● మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ధీమా

గజ్వేల్, డిసెంబరు 8(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గంలో మెజారిటీ సర్పంచ్ స్థానాలు గెలుస్తామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గజ్వేల్ మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల పట్ల గజ్వేల్ నియోజకవర్గంలో ప్రజల నుంచి అపూర్వ స్పందన కనిపిస్తుందన్నారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సారధ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల్లో కాంగ్రెస్ పట్ల ఆదరణ దక్కుతుందని, అద్భుతమైన ఫలితాలు రాబోతున్నాయని ధీమా వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ చీరలు, రూ. 500 సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్, ఫ్రీ బస్, రూ. 2 లక్షల రుణమాఫీ, సన్నబియ్యం, రేషన్ కార్డులు ఇలా అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు మనస్పర్థలు పక్కకు పెట్టి పనిచేయాలని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయనవెంట నాయకులు సర్ధార్‌ఖాన్, శ్రీగిరిపల్లి కుమార్, రామాగౌడ్, నక్క రాములు, జంగం రమేశ్, గాడిపల్లి శ్రీను, గణేశ్ తదితరులున్నారు.

తహసీల్దార్ ఎదుట పలువురి బైండోవర్

కొమురవెల్లి, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలంలో స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించడం కోసం గతంలో జరిగిన ఎన్నికల్లో ఎన్నికల నియమాళిని ఉల్లంగించిన, గొడవలు సృష్టించే అవకాశం ఉన్న 52 మంది వ్యక్తులను సోమవారం తహసీల్దార్ జి.దివ్య ఎదుట హాజరు పరచి బైండోవర్ చేసినట్లు స్థానిక ఎస్సై మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రజలందరూ ఎన్నికల నియమాళిని పాటించి ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని కొరారు. ఎవరైనా బెదిరింపులకు పాల్పడినా, డబ్బులు పంపిణీ చేసిన డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు

పంచాయతీ ఎన్నికల సామగ్రిని సిద్ధం చేస్తున్న అధికారులు



తొగుటలో పోలింగ్ కేంద్రానికి సంబంధించిన ఎన్నికల సామగ్రిని సిద్ధం చేస్తున్న అధికారులు

తొగుట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తొగుట మండలంలో ఈ నెల 14న జరుగనున్న రెండవ విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ సామగ్రిని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో నాగేశ్వర్ నేతృత్వంలో అధికారులు సోమవారం సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలలో అవసరం ఉన్న సామగ్రిని ఒక చోట చేర్చి బ్యాగ్‌లలో నింపుతున్నారు. పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీవో నాగేశ్వర్ తెలిపారు.

చెట్ల నరికివేత





అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి గ్రామంలో చెట్ల మొదళ్ల వరకు నరికివేత

అక్కన్నపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలకు అడ్డువస్తున్నాయని చెట్ల మొదలుతో సహా విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది ఏపుగా పెరిగిన చెట్లను నరికేస్తున్నా పట్టించుకునే నాదుడే కరువయ్యాడు. అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు గత ప్రభుత్వం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో పదేళ్లుగా నాటిన మొక్కలు పెరిగి పెద్దవి కాగా విద్యుత్ అధికారులు తీగలకు అడ్డువస్తున్నాయని చెట్లను మొదళ్ల నుంచి నరికేస్తున్నారు. గతంలో రోడ్లకిరువైపుల పెద్దఎత్తున మొక్కలను నాటించారు. ప్రధాన రోడ్లకిరువైపులా ఇప్పటికే పలుమార్లు చెట్లను నరికేశారు. అయినా అవి పెరుగుతుంటే అధికారులు విద్యుత్ తీగలకు అడ్డువచ్చే చెట్ల కొమ్మలతో పాటు ఇతర చెట్లను నరికేస్తున్నారు. పలుచోట్ల మొదళ్ల వరకు నరికేసి చేతులు దులుపుకుంటున్నారు. ఎంతో ప్రజాదనం వెచ్చించి హరితహారంలో భాగంగా పెంచిన చెట్లను ఎలాంటి అనుమతులు లేకుండా నరికేస్తున్నా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెట్లు నరికివేతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దుబ్బాకలో విత్తన చట్టం 2025 పత్రాలు దహనం

దుబ్బాక, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా సోమవారం దుబ్బాకలోని అంబేడ్కర్ చౌరస్తాలో విత్తన చట్టం 2025 పత్రాలను రైతు కూలీ సంఘం , ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ విత్తన చట్టం 2025 బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కోసమేనని, ఈ చట్టం రైతు వ్యతిరేక చట్టమని మండిపడ్డారు. రాష్ట్రాల మీద కేంద్రం పెత్తనం కోసం కంపెనీల అజామాషి కోసమే ఈ చట్టం తీసుకొచ్చారన్నారు. ఈ చట్టంలో విత్తనాల ద్వారా నష్ట పోయిన రైతులకు పరిహారం, ఆహార భద్రత సరిగ్గా లేదని, బహుళ జాతి, ప్రైవేట్ కంపెనీలు నియంత్రణలో కొనసాగే విధంగా ఈ చట్టం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను తగ్గిస్తూ, ఫెడరల్ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ఉందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఛాతిరి స్వామి , ఎల్లం రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు ప్రజా సంఘాల ఉమ్మడి వేదిక రాష్ట్ర కన్వీనర్‌వంగల సంతోష్, , శ్రామిక శక్తి తెలంగాణ బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు శ్రీదేవి , మేకల రాములు, లక్ష్మణ్, రాజేష్,శేఖర్ తదితరులు పాల్గొన్నారు



దుబ్బాకలో విత్తన చట్టం 2025 పత్రాలను దహనం చేస్తున్న రైతుకూలి సంఘం నాయకులు, ప్రజాసంఘాల నాయకులు

దివ్యాంగ ఉపాధ్యాయులకు ఎన్నికల విధులను మినహాయించాలి



జి. తిరుపతి రెడ్డి

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల విధుల నుండి దివ్యాంగ ఉపాధ్యాయులను మినహాయించాలని జీవో ఉన్నప్పటికీ కొంతమంది ఉపాధ్యాయులకు డ్యూటీలు వేయడం సరైనది కాదని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి. తిరుపతిరెడ్డి ఎన్నికల అధికారులను కోరారు. రిటైర్ అయిన ఉపాధ్యాయులకు కూడా ఎన్నికల విధులు వేయడం ఎన్నికల అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని, మూడు విడతలుగా జరుగుతున్న గ్రామపంచాయతీ ఎన్నికలలో కొంతమంది ఉపాధ్యాయులకు అసలుకే డ్యూటీలు రాలేదని, వచ్చినవారికి మూడు డ్యూటీలు వేశారన్నారు. ముందస్తు ఎలాంటి ఇంటిమేషన్ లేకుండా ట్రైనింగ్‌లకే నేరుగా పంపడం, వరుసగా ట్రైనింగులు, డ్యూటీల వల్ల సుదూర ప్రాంత ఉపాధ్యాయులకు చాలా నష్టం జరుగుతున్నదన్నారు. ట్రైనింగ్ సెంటర్లలో ఉపాధ్యాయులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. రిటైర్మెంట్‌కు ఆరు నెలల ముందు ఎలాంటి ఎన్నికల డ్యూటీ వేయవద్దని నిబంధన ఉన్నప్పటికీ మూడు విడతలుగా డ్యూటీలు వేశారన్నారు.

నీరు నిలువ కుండా చర్యలు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొమురవెల్లి గ్రామ చౌరస్తాలో మురుగు నీరు వెళ్లేలా చర్యలు చేపట్టిన సిబ్బంది

కొమురవెల్లి, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో కనిపించని స్వచ్ఛత అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఆదివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి సోమవారం కొమురవెల్లి గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో నిలిచి పచ్చగా మారిన మురుగునీరు వెళ్లే విధంగా చర్యలు చేపట్టారు. ఇకముందు కూడా చౌరస్తాలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి కరుణాకర్ తెలిపారు.

ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేస్తా..

● మామిడియాల గ్రామాన్ని అభివృద్ధి బాటలో పయనింపజేస్తా..

ములుగు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ పార్టీ మామిడియాల గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఎడ్ల పోచయ్య పేర్కొన్నారు. గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆయన గతంలో తాను ఎంపీటీసీగా పోటీ చేసి ఓడిపోయానని, అప్పటి నుంచి కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా పని చేస్తున్న తనకు మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా, పీఎసీఎస్ వైస్ ఛైర్మన్‌గా పనిచేసే అవకాశం దక్కిందన్నారు. మామిడాల గ్రామ ప్రజలు ఆదరించి గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని, ప్రతి ఒక్కరికి అండగా ఉంటూ కష్టసుఖాల్లో తోడుంటానన్నారు. మామిడాల గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలపడమే తన లక్ష్యమన్నారు. ప్రజలు తన పట్ల ఆదరణ చూపి తనను గెలిపించాలని కోరారు. గ్రామానికి రావలసిన ప్యాకేజీలు, ఇళ్లు మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి విషయం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకుపోయి సమన్యాయం చేసే విధంగా కృషి చేస్తానని, తనను ఆదరించి ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.



కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి ఎడ్ల పోచయ్య

హుస్నాబాద్‌లో తప్పనున్న ట్రాఫిక్ కష్టాలు

- రద్దిని క్రమబద్దీకరించేందకు ప్రత్యేక ట్రాఫిక్ పోస్ట్
- ట్రాఫిక్ పోలీసు సిబ్బందికి పోలీసు స్టేషన్‌లో గది కేటాయింపు

హుస్నాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలో ఇక ట్రాఫిక్ ఇబ్బందులు తప్పనున్నాయి. తీవ్రమైన రద్దిని తగ్గించి వాహన రాకపోకలను క్రమబద్దీకరించేందుకు పట్టణంలో పోలీసులు ప్రత్యేక ట్రాఫిక్ పోస్టును ఏర్పాటు చేస్తున్నారు . దీని ఏర్పాటు కోసం పోలీస్ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించనున్నారు. అందులో భాగంగా సోమవారం సిద్దిపేట ఏసీపీ సుమన్‌కుమార్ టౌన్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్, ఎస్ నీరేశ్‌లు హుస్నాబాద్ ఏసీపీ సదానందంతో కలసి పట్టణంలోని రద్దీ ప్రాంతాలను పరిశీలించారు. పట్టణంలో శుక్రవారం జరిగే వారంతపు సంత, పశువుల మార్కెట్, మల్లెచెట్టు చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తాలో తరుచుగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నట్లు అధికారులు గుర్తించారు. ఇందుకు ప్రజలకు ఇబ్బంది లేకుండా ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించేందుకు తక్షణ చర్యలు అవసరమని నిర్ణయించారు.



హుస్నాబాద్ పట్టణంలోని రద్ది ప్రాంతాలను పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

నూతనంగా ఏర్పాటు చేయబోయే ట్రాఫిక్ పోస్టు కోసం ఒక సబ్ ఇన్స్‌పెక్టర్‌తో పాటు ఆరుగురు పోలీసు కానిస్టేబుళ్ళు అవసరమని ట్రాఫిక్ ఏసీపీ తన నివేదికలో ప్రతిపాదించారు. ట్రాఫిక్ విధులు నిర్వహించే సిబ్బంది కోసం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఒక ప్రత్యేక గదిని కేటాయించారు. ప్రతిపాదనలకు ఆమోదం లభించగానే ట్రాఫిక్ పోస్టును ఏర్పాటు చేయనున్నట్లు ఏసీపీ సదానందం ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ లక్ష్మారెడ్డి తదితరులున్నారు.

ఆటపాటలతో విద్యార్థుల సందడి

హుస్నాబాద్ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పీఎంఎస్ఆర్‌ఐ (ప్రధాన మంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా) కార్యక్రమంలో భాగంగా సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని బెజ్జంకి గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మండలంలోని జిల్లెలగడ్డ గురుకుల కళాశాలలో బతుకమ్మ ఆటలు, ఇతర ఆట పాటలతో సందడి చేశారు. పీఎంఎస్ఆర్ఐ కార్యక్రమంలో భాగంగా విద్యతో పాటు వివిధ రంగాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని ప్రిన్సిపాల్ బి శ్యామలత తెలిపారు.



బతుకమ్మ ఆటలతో విద్యార్థులు, ఉపాధ్యాయుల సందడి

గ్రామాభివృద్ధి చేసి చూపిస్తా..

- పేదింటి ఆడబిడ్డల పెళ్లికి పుస్తె మెట్టెలు పంపిణీ చేస్తాం
- బొడ్రాయి ఏర్పాటు చేసి పండుగ నిర్వహిస్తాం
- సర్పంచ్ అభ్యర్థి పసుల రజిత రమేశ్ ముదిరాజ్

వర్గల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : వర్గల్ గ్రామ సర్పంచ్‌గా ప్రజలు అవకాశం ఇచ్చినట్లయితే గ్రామాన్ని అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని వర్గల్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి పసుల రజిత రమేశ్ ముదిరాజ్ అన్నారు. తనను గెలిపిస్తే పేదింటి ఆడబిడ్డల పెళ్లికి సర్పంచ్‌గా ఉన్నన్ని రోజులు పుస్తె మెట్టలు పంపిణీ చేస్తానన్నారు. సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన నెల రోజుల్లో గ్రామానికి వైకుంఠ రథాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. పారిశుధ్య సమస్యలపై తక్షణ చర్యలు చేపడతామన్నారు. గ్రామంలోని ప్రతి వార్డులో సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తామని, ఎల్లమ్మ ఆలయం వద్ద నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేస్తామన్నారు. సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీని ఏర్పాటు చేస్తామన్నారు. నిర్మాణం పూర్తయిన గ్రంథాలయ భవనాన్ని అందుబాటులోకి తెస్తామన్నారు. నిరుద్యోగులైన వారికి టీజీఐఐసీలో నెలకొల్పబోతున్న పరిశ్రమలలో ఉపాధి అవకాశాలను కల్పిస్తామన్నారు. బొడ్రాయిని ఏర్పాటు చేసి పండుగ నిర్వహిస్తామన్నారు. మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నట్లుగా గ్రామపంచాయితీ సర్పంచ్‌గా బీజేపీ మద్ధతు అభ్యర్థి అయిన తనను ప్రజలు ఆదరించి గెలిపించినట్లయితే 25లక్షల ఎంపీ నిధులతో గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చుదిద్దుతామన్నారు.



వర్గల్ సర్పంచ్ అభ్యర్థి పసుల రజిత రమేశ్ ముదిరాజ్

వైన్స్ వద్దంటే కేసులా?

సిద్దిపేట క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వైన్ షాపును తొలగించాలని కోరితే సంధించాల్సింది పోయి ఉల్టా కేసులు పెడతామని బెదిరించడం ఎంతవరకు సమంజసం అని బీజేపీ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు బాసంగారి వెంకట్ ప్రశ్నించారు.ఎక్సైజ్ నిబంధనల ప్రకారం వైన్ షాపులు ఆలయ సమీపంలో ఉండకూడదని, కానీ రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా దాసాంజనేయ గుడి సమీపంలో వైన్ షాప్ ఏర్పాటుచేసిన అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదని నిలదీశారు. సోమవారం పార్టీ నాయకులతో కలిసి వైన్ షాప్ దగ్గర ఆలయ పవిత్రతను దెబ్బతీసే విధంగా వైన్ షాపు ఏర్పాటు చేసినందుకు ఎవరు ఇక్కడ మద్యం కొనరాదని ఫ్లెక్సీ ఏర్పాటు చేసి మాట్లాడారు. వైన్ షాప్ తొలగించాలని ఆందోళనలు చేపట్టి, ఉన్నత అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే అక్కడి నుండి వైన్స్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు



వైన్ షాపు ముందు ముందు ఫ్లెక్సీ తో నిరసన వ్యక్తం చేస్తున్న సిద్దిపేట పట్టణ బీజేపీ అధ్యక్షుడు బాసంగారి వెంకట్

నకిలీ విత్తనాలను విక్రయిస్తే కఠినచర్యలు తప్పవు

మిరుదొడ్డి, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా సరే నకిలీవిత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అక్బర్‌పేట-భూంపల్లి వ్యవసాయాధికారి సత్యాన్వేషన్ హెచ్చరించారు. సోమవారం అక్బర్‌పేట చౌరస్తాలో ఎరువుల దుకాణాలను తనీఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ఎరువుల దుకాణదారులు స్టాక్‌రికార్డుల్లో నమోదుచేసుకోవాలని సూచించారు. అధిక ధరలకు ఎరువులను, విత్తనాలను విక్రయిస్తే పీడీయాక్ట్‌ను నమోదు చేస్తామని హెచ్చరించారు.



అక్బర్‌పేటలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏవో సత్యాన్వేష్

ఏదైతే అది.. ఏకరం అమ్మేయ్!

(5వ పేజీ తరువాయి)

ప్రదర్శించాడు. ఏకగ్రీవం చేస్తే దుర్గమ్మ గుడి నిర్మించడంతో పాటు గ్రామావసరాలకు స్థలం ఇస్తానంటూ రకరకాల ప్రయత్నాలు చేయసాగాడు. ఈ విషయం ఇతర గ్రామాలను ప్రభావితం చేయసాగడంతో, లేనిపోని ఆలోచనలకు తావివ్వసాగింది. కానీ సదరు అభ్యర్థి గుట్టుచప్పుడు కాకుండా భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు యత్నించగా, పోలీసులు రంగప్రవేశం చేసి కుల పెద్దలందరినీ పిలిపించి బైండోవర్ నోటీసులు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన యెడల చర్యలు తప్పవని హెచ్చరించారు. దీంతో ఇతర గ్రామాలలో అదే దిశగా చర్యలు తీసుకోబోతున్న వారికి కాస్త గుణపాఠం కలగడంతో విరమించుకోవడం చర్చనీయాంశమైంది.


బెల్టు షాపులతో జోరుగా విందులు

చేర్యాల మండలంలోని ఆయా గ్రామాలలో పలువురు అభ్యర్థులు మందు, విందుల జాతరకు తెరలేపారు. పొద్దంతా ప్రచారం చేస్తూ కుల సంఘాలు, మిత్రులు, ఓటర్లను కలుస్తూ రాత్రికి తమ తమ అనుయాయుల ద్వారా రహస్యంగా ఇండ్లు, వ్యవసాయ బావుల వద్ద విందులు ఇస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని బెల్టు షాపుల్లో అధిక ధరలకు మద్యం విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. తమ జేబులకు చిల్లులు పడుతున్నా, ప్రస్తుత అత్యవసర సమయంలో మందు దొరుకుతుందని అభ్యర్థులు సంతోషిస్తున్నారు. అయితే, ఈ అవకాశాన్ని ఆసరా చేసుకున్న పలువురు మందు బాబులు అభ్యర్థులతో ఆటాడుకుంటుండటంతో, అభ్యర్థులు తలలు పట్టుకుంటుండటం కొసమెరుపు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

గజ్వేల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియెగించుకోవాలని రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు కోరారు.

గజ్వేల్ పట్టణంలోని రామకోటి కార్యాలయంలో బియ్యంతో చేసిన ఓటు వేసే చిత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. ఓటుతో ప్రజాస్వామ్యం కాపాడుకోవచ్చునని అన్నారు.



బియ్యంతో తయారు చేసిన ఓటు వేసే చిత్రం

ఘనంగా పీవీ రాజేశ్వరరావు శత జయంతి వేడుకలు

(5వ పేజీ తరువాయి)

అతిథులుగా ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు కూతురు, ఎమ్మెల్సీ సురభి వాణి పాల్గొని మాట్లాడారు. సిద్దిపేట ప్రాంతానికి విద్యుత్ కాంతితో పాటు విద్యా కాంతులను పంచిన మహనీయుడు పీవీ రాజేశ్వరరావు అని కొనియాడారు. తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలను కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు చేయబోతున్న నేపథ్యంలో బూర్గుల రామకృష్ణారావుతో మాట్లాడి సిద్దిపేటకు డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఎంతో మంది ఐఏఎస్ అధికారులను, రాజకీయ నాయకులను, ఉద్యోగులను, సామాజికవేత్తలను, కళాకారులను అందించిందని కళాశాల ప్రగతి గురించి ు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి. సునీత వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనమండలి సభ్యులు ఫారూఖ్ హుస్సేన్, దేవిప్రసాద్, డాక్టర్ నందిని సిధారెడ్డి, డాక్టర్ పాపయ్య, ఎం. రాఘవేంద్రరావు, డాక్టర్ పి. అయోధ్య రెడ్డి, అలాగే కళాశాల పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, పీవీ రాజేశ్వరరావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల కేటాయింపులో తప్పిదం!

(5వ పేజీ తరువాయి)

ఈ నెల 11న మొదటి విడతలో విధులు నిర్వహించేవారు ఈ నెల 10న విధుల్లో చేరాల్సి ఉంటుంది. విధుల అనంతరం వారు 12న విశ్రాంతి తీసుకుని 13న మళ్లీ విధుల్లో చేరాల్సి ఉంటుంది. 13, 14న విధులు పూర్తి చేసి 15న మళ్లీ విశ్రాంతి తీసుకుని 16, 17న విధులు నిర్వహించాల్సి ఉంటుంది. వరుస విధుల కేటాయింపులు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలుస్తోంది. కాగా ఈ ప్రక్రియ అంతా సాఫ్ట్‌వేర్ ద్వారా పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

యూత్ ఫర్ ఎడ్యుకేషన్

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల నుంచి జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో యూత్ ఫర్ ఎడ్యుకేషన్‌లో భాగంగా దత్త గ్రామమైన పొన్నాలలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ సైన్స్ పట్ల అవగాహన కల్పించారు. డ్రగ్స్, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా మత్తుకు దూరంగా ఉండాలని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం అధ్యాపకులు కమలాకర్, అనిరుద్, పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు. అంతకుముందు ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి జీవన్ కుమార్ ఎన్ఎస్ఎస్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డా. జీవన్ కుమార్

ఓటరు జాబితాలో తప్పులు..

● మృతుల పేర్లు యదాతథం
● తల్లిదండ్రులది ఓ వార్డులో పిల్లలది మరో వార్డులో
● తొలగించని డబుల్ ఓటర పేర్లు

మద్దూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఓటరు జాబితాలో తప్పొప్పుల్ని సరిచేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. ఓటరు జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా చూడాలన్న ప్రభుత్వ ఆదేశాల్ని పెడచెవిన పెట్టినట్లు తెలుస్తోంది. గెలుపోటముల్ని తలకిందులు చేసే పరిస్థితులుంటాయని అధికారులకు తెలియకపోవడం శోచనీయంగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఓటరు జాబితాలో మార్పులు చేర్పులకు అవకాశం కల్పించినా సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. గత ఓటరు జాబితా ఆధారంగా ముసాయిదా జాబితా రూపొందించి సవరణకు అవకాశం కల్పించినా సరిచేయకుండానే ఓటరు తుది జాబితాను ప్రకటించారు. పలు కారణాలతో ఎన్నికలు వాయిదా పడగా, ఇంతలోనే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వాహణకు ప్రభుత్వం ముందుకు రావడంతో మరోసారి మార్పులకు, చేర్పులకు అవకాశం ఇచ్చినా బీఎల్‌వోలు పూర్తి సమాచారాన్ని సేకరించి సరిచేసింది లేదన్నట్లు తెలిసింది. నవంబరు 23న తుది జాబితాను ప్రకటించినా మార్పులు, చేర్పుల్ని సరిచేయలేదన్నట్లు తెలుస్తోంది. మద్దూరు మండలం లద్నూరులోని ఓటరు జాబితాలో తప్పుదొర్లాయి. చనిపోయిన వారి పేర్లు ఓటర్ల జాబితాలో రావడం గమనార్హం.

ఓటరు జాబితాలో సవరణ చేసేటప్పుడు ఒకే కుటుంబానికి చెందిన వారి పేర్లు వేర్వేరు వార్డులో ఉండటంతో సరిచేసి ఒకే వార్డు ఉండే విధంగా చూడకపోవడంతో పాటు డబుల్ పేర్లు తొలగించకపోవడం, తల్లిదండ్రులది ఒక వార్డులో ఉంటే పిల్లలది మరోవార్డులో ఉండటంతో అయోమయం నెలకొంది. ఓటర్లకు ఇబ్బందులతో పాటు అభ్యర్థుల ప్రచారానికి సైతం ఇబ్బందులు తప్పడం లేదన్నట్లు తెలుస్తోంది.

ఓటర్లకు మద్యం పంపిణీ.. కేసు నమోదు

కొమురవెల్లి, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలంలోని అయినపూర్ గ్రామంలో ఓటర్లను ప్రలోభపెడుతున్నారు. ఆదివారం రాత్రి మద్యం పంపిణీ చేస్తున్నారన్న సమాచారం మేరకు స్పందించి గ్రామానికి వెళ్లి తనిఖీలు చేపట్టగా ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా మద్యం పంపిణి చేస్తున్నారని తేలడంతో 24 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై టి.మహేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని ఖాళీ మద్యం సీసాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.